

చిన్నారులకు ఉచిత రక్తపరీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని దేవత నగర్‌లోని చైతన్య సర్వీస్ సొసైటీ చిన్నారులకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత రక్తవర్గీకరణ చేసి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ తమ బ్లడ్ గ్రూప్స్ తప్పకుండా తెలుసుకోవాలని, ఆశ్రమ చిన్నారులకు ఉచితంగా రక్త వర్గీకరణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. చైతన్య సర్వీస్ సొసైటీ ఆశ్రమ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.వి.ఎస్.బాబు మాట్లాడుతూ 11 ఏళ్ల నుండి ఎన్నో సేవలు అందిస్తున్న హెల్పింగ్ మైండ్స్ అందరి మన్ననలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తూ ఉండటం చాలా హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చైతన్య సర్వీస్ సొసైటీ ఆశ్రమ ఫౌండర్ ఎం.పి.ఆనందన్,సెక్రటరీ కవితరాణి, ఎస్క్యూటివ్ డైరెక్టర్ కృష్ణచరణ్, హెల్పింగ్ మైండ్స్ బృందం కిరణ్, పవన్ పాల్గొన్నారు.



చిన్నారులకు రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆత్మవిశ్వాసంతో ముందుకెళదాం

- నాయకులు, కార్యకర్తలతో వైఎస్.జగన్
- అడుగడుగునా నీరాజనం
- కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం
- పులివెందుల్లో తోపులాట..పగిలిన కిటికీ అద్దాలు



కడప ఎయిర్‌పోర్టులో ప్రజలకు అభివాదం తెలియజేస్తున్న వైఎస్ జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/కడప/వేంపల్లె

ప్రతిపక్షం మనకు కొత్త కాదని ఎవరు అధైర్య పడకూడదని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్దామని ఏ సమస్య వచ్చిన మీ వెంటే నడుస్తానని నాయకులకు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వైఎస్ఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు చేరుకున్నారు. కడప నుంచి రోడ్డు మార్గంలో పులివెందులకు చేరుకున్నారు. రోడ్డు మార్గంలో వెళుతున్న జగన్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తనను ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రజల కోసం తన వాహనాన్ని ఆపుతూ జగన్ వెళ్లారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి అభివాదం చేశారు. దాడిపొడవునా అందరినీ నవ్వుతూ పలకరిస్తూ వెళ్లారు. కొందరైతే బాణాసంచా కాల్చుతూ స్వాగతం పలికారు. జగనన్నా నీవెంటే అంటూ జనాలు పెద్ద ఎత్తున కేకలు వేశారు. పులివెందుల క్యాంపు కార్యాలయానికి చేరుకుని జగన్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జగన్‌ను కలిసిన వారిలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ శాసనమండలి చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప నియోజకవర్గంలోని వివిధ మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

పులివెందుల పర్యటనలో భాగంగా శనివారం కడప విమానాశ్రయానికి చేరుకున్న జగన్ మోహన్‌రెడ్డి అక్కడ నుండి రోడ్డు మార్గాన పులివెందులకు వెళుతుండగా రామరాజుపల్లి సర్కిల్ వద్ద చిన్న ఆపశృతి చోటుచేసుకుంది. జగన్ అభిమానులు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో కాన్వాయ్‌లోని ఓ వాహనం సడన్ బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న ఇన్నోవా కారును ఫైర్ ఇంజన్ ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



పులివెందుల క్యాంప్ ఆఫీసులో కార్యకర్తలు, అభిమానుల తోపులాట నడుమ జగన్ అభివాదం

పులివెందుల్లో తోపులాట..పగిలిన కిటికీ అద్దాలు

జగన్‌ను కలిసేందుకు వైసిపిశ్రేణులు తోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. భద్రతా సిబ్బంది జగన్ కార్యాలయంలో కాకుండా తన నివాసంలోనికి వెళ్తారని అక్కడ బందోబస్తుని ఏర్పాటు చేశారు అనుకోకుండా వైసిపి కార్యాలయాలోకి జగన్ రావడంతో అప్పటికే అక్కడ భారీగా తరలివచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జై జగన్, జై సిఎం అంటూ ఆయన కలిసేందుకు ముకుముడిగా వాహనం వైపు రావడంతో పోలీసులు చేసేదేమీ లేక చేతులు వెత్తారు. ఒకరికొకరు తోసుకుంటూ కార్యాలయంలోకి పోయేంతవరకు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది ఈ తోపులాటలో కొంతమంది కిటికీల మీద పడడంతో అద్దాలు పగిలాయి.

కౌంటింగ్ తర్వాత జరిగిన పరిణామాలపై చర్చ

నియోజకవర్గంలో కౌంటింగ్ తర్వాత అధికారం కోల్పోవడంతో గ్రామాలలో జరిగిన పరిణామాలపై వైసిపి శ్రేణులతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చర్చించారు. మెజార్టీ తగ్గడానికి గల కారణాలను వైసిపి శ్రేణులు జగన్‌కు వివరించినట్టు తెలుస్తుంది. ధైర్యంగా ఉండండాలని, ఐదేళ్లు తొందరగా వస్తాయాని జగన్ కార్యకర్తలు, నాయకులతో పేర్కొన్నారు.

అడుగడుగునా జగన్‌కు నీరాజనం

మాజీ ముఖ్యమంత్రి పులివెందుల, ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అడుగడుగునా నీరాజనం పలికారు. శనివారం విజయవాడ నుంచి పులివెందులకు విచ్చేశారు. కడప ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా వేంపల్లె మీదుగా పులివెందులకు బయలుదేరారు. వేంపల్లె బైపాస్ రోడ్డులోని దారి పోడవునా జనాలు నిల్చుని ఆయనకు స్వాగతం పలికారు. వారిని జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ వెళ్లారు. స్థానిక హనుమాన్ జంక్షన్, రాజీవ్ నగర్ కాలనీ వద్ద వైసిపి నాయకులు జగన్‌కు నీరాజనం పలికారు. 'అన్నా..నీవెంటే మేము' అంటూ పెద్ద ఎత్తున కేకలు వేశారు. జగన్‌ను కలిసిన వారిలో అయ్యవారిపల్లి రామగంగిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, శేషు, మటన్ బాబా, చంద్ర, రాజ్ కుమార్, హబీబ్, బికారి, ఆది, కటిక చంద్ర శేఖర్, మణిగోపాల్ రెడ్డి, కొత్తూరు రెడ్డయ్య, పాస్టర్ రవికుమార్ ఉన్నారు.

ప్రజాభిష్టం మేరకే పాలన సాగాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమిని ప్రజలు ఎన్నో ఆశలతో భారీ మెజారిటీతో గెలిపించారని, సంకీర్ణ ప్రభుత్వం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా మంచిపాలన అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు కోరారు. అధికారం చేపట్టగానే ఇచ్చిన హామీ మేరకు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలు చేయడాన్ని స్వాగతించారు. శనివారం రాయచోటిలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్‌డిఎ, మోడీ చరిష్మా దెబ్బతింటే దాన్ని కప్పిపుచ్చి బిజెపి రాష్ట్రంలో ఎన్‌డిఎ గెలుపు అని ప్రచారం చేసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పడింది తెలుగుదేశం నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై పెత్తనం చేయాలని తెలుగుదేశం ఉనికిని కనపడకుండా చేయాలన్న ప్రయత్నంలో భాగంగానే బిజెపి ఎన్‌డిఎ ముసుగును తొడుక్కుందని అన్నారు. ఐదు సంతకాల ఒరవడిలోనే టిడిపి-జనసేన ఇచ్చిన మిగిలిన వాగ్దానాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతి శాశ్వత రాజధానిగా నిర్ణయించేలా చట్టం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే విధంగా ప్రయత్నించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావాలంటే ముందుగా నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పునరావాసం పనులను, నిర్వాసితుల కాలనీల ఏర్పాట్లను పూర్తి చేయాలని కోరారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఏజెన్సీలో జిఒ నెంబర్ 3 పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతాలకు స్పెషల్ డిఎస్‌సిని నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీ టీచర్ పోస్టులతో పాటు మిగిలిన ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. స్మార్ట్ మీటర్లను తెలుగుదేశం వ్యతిరేకించిందని, మంత్రి నారా లోకేష్ గతంలో వాటిని ధ్వంసం చేయాలని కూడా పిలుపునిచ్చారని, ఇప్పుడు రైతుల నెత్తిపై కుంపటిలా ఉన్న స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెచ్చిన జిఒ 596ను రద్దు చేసి అసైన్డ్‌మెంట్ భూములు పేదలకే దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో జరిగిన భూదందాలు, మద్యం, స్మార్ట్‌మీటర్లు, బైజూస్, పోలవరం అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణకోసం, లౌకికతత్వం, ఫెడరలిజం, రాజ్యాంగ పరిరక్షణ తదితర అంశాల్లో ఒక లౌకిక పార్టీగా తెలుగుదేశం గట్టిగా నిలబడి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరారు. ఉపాధి నిధులు దారిమళ్లించడం అన్యాయం అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల్లో ఇండియా తరుపున పోటీ చేసిన అభ్యర్థులకు ఓట్లు వేసిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అరకు పార్లమెంట్, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిపిఎం అభర్థులకు మంచి ఓటింగ్ లభించిందని, ఆదివాసులు పార్టీని ఆదరించారన్నారు. మిగతా ప్రాంతాల్లో పార్టీ ప్రజా పునాది తగ్గిందని, సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసుకొని ప్రజా పునాదిని పెంచుకునే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సామాగ్రాభివృద్ధి కోసం కృషి చెయ్యాలని ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కడప బెంగుళూరు రైల్వే లైన్, హంద్రీ-నీవా ప్రాజెక్టు పూర్తి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, వెంకట్రామయ్య, నాయకులు హరిశర్మ, రామచంద్ర, చలపతి, బసిరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి వై.శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని ప్రయివేట్ పాఠశాలల యజమాన్యాల వారు విద్యార్థుల తల్లదండ్రుల వద్ద ఫీజులు, పాఠ్య పుస్తకాల కోసం అధిక రుసుం వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులొస్తున్నాయన్నారు. విద్యార్థులకు చదువుకోవడానికి ఇచ్చిన పాఠ్యపుస్తకాలను అమ్ము



మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

కుంటున్నట్లు, రికగ్నిషన్ లేకుండానే కొన్ని పాఠశాలలను ప్రారంభిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి అన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ పాఠశాలల నియమావళికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు ఇదివరకు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం తమ పరిధిలోని ప్రయివేట్ పాఠశాలలను సందర్శించి నిబంధనలు పాటించని వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వాటి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ వర్కర్ల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ముందుగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గడిచిన 55 సంవత్సరాల కాలంలో అనేక రకాల కార్మికులకు సంఘాలు పెట్టి వారి హక్కులను చట్టాల అమలకు నీతి నిజాయతీ క్రమశిక్షణలతో రాజీ లేకుండా పోరాడుతోందని పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, ఆప్కాస్ రద్దు చేయాలని సమ్మెలో మొదటి అడుగు వేసి చివరి వరకు జిఒల సాధనకి పోరాటం చేసిన సంఘం సిఐటియు అని పేర్కొన్నారు. పెట్టుబడిదారి ప్రభుత్వాలను కూల్చి కార్మికవర్గ రాజ్య స్థాపన చేయడమే ధ్యేయంగా సిఐటియు పని చేస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సిఐటియు విస్తరణతో పాటు ఆర్థిక సామజిక భద్రత కోసం కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ల రద్దు కోసం జులై 10న దేశ వ్యాప్త నిరసన చేపడుతున్నామని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక : మున్సిపల్ వర్కర్ల జిల్లా అధ్యక్షులుగా బివి.రమణ ప్రధాన కార్యదర్శిగా పి.వి.రమణ కోశాధికారిగా సి.రాంబాబు, గౌరవ అధ్యక్షులుగా ఎ.రామాంజులు, ఉపాధ్యక్షులుగా సి.హెచ్.ఓబయ్య, డి.లక్ష్మిదేవి, కె.ప్రసాద్, ఎం.చెన్నయ్య, ఆర్.మమత, వి.నాగంజనేయులు, కార్యదర్శులుగా పి.విజయకుమార్, బి.వెంకటలక్ష్మి వై.ఏడుకొండలు, ఎం.రెడ్డెయ్య, బి.మాధవి, ఎం.కిరణ్‌లతో పాటు మరో పది మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారు



మాట్లాడుతున్న బాధితుడు సాయి నితిన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గతంలో తాను నేరాలు చేసిన మాట వాస్తవమేనని, అయితే మంచి జీవితాన్ని గడుపుతున్న తనను పాత నేరస్థుడుగా పోలీసులు ముద్ర వేసి తనను చిత్ర హింసలకు గురి చేస్తున్నారని బాధితుడు సాయి నితిన్ ఆవేదన వ్యక్తం చేశాడు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో భార్య హిమజతో కలిసి ఆవేదనను వెలిబుచ్చాడు. అనంతపురం జిల్లా, తనకల్లు మండలానికి చెందిన తాను మూడేళ్ల కిందటి వరకూ జులాయిగా తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను ఎన్నుకుని రాత్రి వేళల్లో దొంగతనం చేసేవాడన్నారు. రెండేళ్ల క్రితం నుంచి దొంగతనాలు మానేసి మంచి జీవితం గడుపుతున్నానని చెప్పారు. అయినప్పటికీ తాను ఏ తప్పు చేయకపోయినా తిరుపతి పోలీసులు ఒడిశా, కర్ణాటక పోలీసులు మరో సారి తనని స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఎడుమ కాలు మోకాలును విరగ్గొట్టారని, కటింగ్ బ్లేడుతో వెంట్రుకలు లాగడం, కాలి గోళ్లని పీకెయ్యడం, సిగరెట్ లైటర్‌తో అరికాలిపై కాల్చడం వంటి చిత్రహింసలు పెట్టారని ఆరోపించాడు. తన భార్యకు సంబంధం లేకపోయినా మహిళ అని చూడకుండా స్టేషన్‌లో నిర్బందించి విచక్షణారహితంగా కొట్టారని వాపోయాడు. ఇటీవల మదనపల్లె ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌కు బలవంతంగా తీసుకెళ్లి రెండ్రోజులు టార్చర్ పెట్టాడని తెలిపాడు. చోరీలో తన ప్రమేయం లేదని తెలుసుకుని విడిచి పెట్టారన్నారు. తాను అన్ని మానుకుని మంచి జీవితం గడుపుతున్నానని పోలీసులు మానవతా దృక్పథంతో ఆలోచించి ఇకనైనా నాకు మంచి జీవితం గడిపేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాడు.

శ్రీసాయి కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ అధ్యపకుడి, కళాశాల మేనేజ్‌మెంట్ విభాగాధిపతి కె. ఇంతియాజ్‌కు జెఎన్‌టియు అనంతపురం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియు మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ టి. నారాయణ రెడ్డి, సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, పుత్తూరు మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పి. సుబ్రహ్మణ్య చారి ఆధ్వర్యంలో 'స్టడీ ఆన్ క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ అమాంగ్ ఎంప్లాయిస్ ఆఫ్ రీజినల్ రూరల్ బ్యాంక్స్ విత్ రిఫరెన్స్ టు రాయలసీమ రీజియన్' అనే అంశంపై సమర్పించిన పరిశోధన థీసిస్ కు యూనివర్సిటీ యాజమాన్యం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్ అందుకున్న కె. ఇంతియాజ్ మేనేజ్‌మెంట్ విభాగంలో 16 సంవత్సరాల టీచింగ్ అనుభవంతో పాటు యుజిసి నెట్, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 18 అంశాలపై పేపర్ల ప్రచురణ, రెండు బుక్ చాప్టర్లు, ఒక బుక్ ప్రచురణ, 10 ఎన్‌పిటిఇఎల్ కోర్సులు, క్వాలిఫైడ్ ఎన్‌పిటిఇఎల్ డొమైన్ సర్టిఫికెట్ అర్హత సాధించానని అన్నారు. డాక్టరేట్ అందుకున్న అధ్యాపకుడిని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.పి .వి సుబ్బయ్య, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.సాయి నీరజ్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగ, మోహన్, చందు, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు అభినందించారు.

ధూపదీప నైవేద్య నిధి పెంచడం హర్షణీయం

ప్రజాశక్తి-పీలేరు

ధూప దీప నైవేద్య నిధి పథకం లబ్ధిని పెంచడం హర్షణీయమని పీలేరు మండల బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కన్వీనర్ సంతోష్ కుమార్ అయ్యర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.50 వేల కంటే తక్కువ ఆదాయం కలిగిన ఆలయాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఆలయ అర్చకులకు ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.5 వేలను రూ.10 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన 2 వారాల్లోపే రూ.50 వేల లోపు ఆదాయమున్న దేవాలయాలకు చేస్తున్న సాయాన్ని మరింత పెంచుతూ తొలి సంతకం చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. గతంలో ఎన్నో విభిన్న పథకాలను ప్రవేశపెట్టి లక్షలాది బ్రాహ్మణ కుటుంబాల్లో వెలుగు నింపిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ ఇప్పుడు ఎలాంటి నిధులు లేక గత ప్రభుత్వ పెద్దల చేత మోసగించబడి ఎటువంటి పథకాలూ అమలుకాక నిర్వీర్యమైన బ్రాహ్మణ సంక్షేమ సంస్థకి సకాలంలో నిధులు కేటాయించి తద్వారా నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలలో వెలుగులు నింపడానికి ప్రయత్నం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకుంటున్నామని పేర్కొన్నారు.


దాడులపై సిఎం, డిప్యూటీ సిఎం స్పందించాలి : విసికె

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న శివప్రసాద్

కౌంటింగ్ తర్వాత రాష్ట్రంలో చెలరేగిన హింసలో ప్రధానంగా దళితులే టార్గెట్ అయ్యారని, విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ టిడిపి ముసుగులో కొన్ని అరాచక శక్తులు రంగ ప్రవేశం చేసి, కుల ఉన్మాదంతో దళితులపై దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. దళితుల ఆస్తులు, పంటలు ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. కొన్ని చోట్ల దళితుల మధ్యే చిచ్చుపెట్టి వాళ్ళువాళ్లే కొట్టుకొనేలా చేస్తున్నారని ఆరోపించారు. తమ అకృత్యాలతో ఈ అరాచక శక్తులు టిడిపి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో తమపై కొనసాగిన హింస, అరాచకం భరించలేకనే దళితులు వైసిపికి వ్యతిరేకంగా ఓట్లు వేసి, టిడిపి కూటమికి అధికారం కట్టబెట్టారని గుర్తు చేశారు. దళితులు, కాపులు గంప గుత్తగా ఓట్లు వేయడం వల్లే టిడిపి కూటమి ఘనవిజయం సాధించిందన్న విషయం మరచిపోకూడదని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో కొనసాగినట్లే, టిడిపి ప్రభుత్వంలోనూ దళితుపై హింస కొనసాగితే భవిష్యత్తులో దాని తాలూకు దుష్ప్రభావాన్ని టిడిపి చవి చూడవలసి ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి దళితులపై దాడుల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం లాగా అరాచకాలు చేయకండి, హుందాగా ప్రవర్తించండి, అంటూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పదేపదే ఎందుకు చెబుతున్నారో టిడిపి శ్రేణులు అర్థం చేసుకోవాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసేందుకు, నిన్న అసెంబ్లీకి వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన పట్ల ఎక్కడా కక్ష పూరితంగా వ్యవహరించలేదని, ఎంతో హుందాగా వ్యవహరించారని, పార్టీ శ్రేణులు కూడా చంద్రబాబు బాటలో నడవాలని సూచించారు. దళితులపై దాడులు ఇలాగే కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని, త్వరలోనే దళిత నేతలంతా సమావేశమై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టడానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు.



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న కళాశాల యాజమాన్యం

జాతీయ స్థాయిలో 'మిట్స్'కు గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్)కు జాతీయ స్థాయిలో టాప్ 20 కళాశాలగా ఎఎఎ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఇఎల్ వారు ఆన్‌లైన్‌లో జనవరి-ఏప్రిల్ 2024 సెషన్‌లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం 4858 సర్టిఫికెట్ కోర్సెస్‌కు హాజరు కాగా అందులో 3463 ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఇఎల్ సర్టిఫికెట్‌ను పొందారు. కళాశాలకు ఎఎఎ రేటింగ్‌తో పాటు టాప్ 20లో మిట్స్ కళాశాలకు గుర్తింపును అందించినట్లు పేర్కొన్నారు. చెన్నైలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ మద్రాస్‌లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో కళాశాల మెకానికల్ ప్రొఫెసర్ డాక్టర్ పృధ్వీరాజన్ ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. కళాశాలకు ఎన్‌పిటిఇఎల్ వారు అందించిన ఈ గుర్తింపుకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులు చేసిన కృషికి కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, విద్యార్థులు, అధ్యాపకులు చేసిన కృషికి గాను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి - రాయచోటి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు కలిశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా ఎన్నికైన సందర్భంగా నారా చంద్రబాబు నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజులలో నియోజక వర్గంలో కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని చెప్పినట్లు తెలిపారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసాద్‌బాబు

దోపిడీ

ప్రజా'దృష్టి'

ఉమ్మడి జిల్లాలో అక్రమార్కుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ఇసుక, మట్టి, ఎర్రచందనం వంటి ప్రకృతివనరుల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఎవరు అధికారంలో ఉన్నా, తమ దోపిడీకి అడ్డెవరనే ధీమాతో మాఫియా యథేచ్ఛగా సాగిపోతోంది. ఆదినిమ్మాయపల్లి బ్యారేజ్ సమీపంలో ఇసుక అక్రమ రవాణాపై ఆర్‌డిఒ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మైదుకూరు నియోజకవర్గం మల్లేపల్లి, అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ కేంద్రం సమీపంలోని ఊటుకూరు సమీప ప్రాంతాల నుంచి యథేచ్ఛగా సాగుతున్న మట్టి అక్రమ రవాణాను ఊటుకూరు గ్రామస్తులు అడ్డుకున్న వైనం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గ్రామీణులు తిరగబడే వరకు సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికా రులు ఏమి చేస్తున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారిన నేపథ్యంలో అధికారులు ముందుకెళ్తే ఏమవుతుందో, వెనక్కి వెళ్తే ఏమవుతుందోననే ఉద్దేశంతో పోలీస్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు అధికారులను కలిసి బొకేలు ఇవ్వడానికి పరిమితం కావడం ఆందోళనకరం. తమ శాఖల పరిధిలో ఏమి జరుగుతోందనే ఆలోచన లేకపోవడం సరికాదని గ్రహించాలి. త్వరలో ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉన్నతాధికారుల బదిలీలు ఉన్న నేపథ్యంలో అధికారులు చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వెళ్తే ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని ఉద్దేశమూ కావచ్చు. ఇందుకు అనుగుణంగానే కడప జిల్లాలో పలువురు పోలీస్ అధికా రుల బదిలీలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇటువంటి నిర్లక్ష్యపు జాడ్యంతో ఇసుకాసురులు, మట్టి మాఫియాలు యథేచ్ఛగా దోపిడీకి లాకులెత్తడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు అక్రమార్కులతో చేతులు కలిపి అక్రమాలను సక్రమం చేసే పనిలో నిమగ్నం కావడం దొందూదొందే అనే అభిప్రాయాన్ని కలిగిస్తుండడం గమనార్హం. వైసిపికి చెందిన నాయకులను విమర్శించిన టిడిపి నాయకులు ఇప్పుడు వారితోనే అంటకాగడంలోని ఆంతర్యమేమిటో వెల్లడించాలి. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే 13 మంది అభ్యర్థులు అసెంబ్లీకి వెళ్లి ప్రమాణ స్వీకారం చేయడంలో చూపిన చొరవ కాదు, జిల్లాలోని అక్రమాల తంతును అరికట్టడంలో చూపించాల్సిన అవసరం ఉందని గ్రహించాలి. అప్పుడే గెలిపించిన ప్రజలకు సేవ చేసినట్లు అవుతుంది. ఇసుక, మట్టి మాఫియా వంటి ప్రజావ్యతిరేకులను కట్టడి చేయాల్సిన నాయకత్వం, అక్రమార్కులకు వంతపాడితే ప్రజలఆదరణను వేగంగా కోల్పోతారనే సంగతిని మరువరాదు. 2009 నుంచి 2019 వరకు సుమారు పదేళ్లుగా కడప జిల్లాలో ఒక సీటుకే అధికార టిడిపి పరిమితమైన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి ఏడు స్థానాలను, బిజెపి, జనసేన ఒకటి చొప్పున గెలుచుకున్నాయి. వైసిపి తరహా కబ్జాలకు, అక్రమ రవాణాకు లాకులెత్తితే ఇంతకంటే దారుణ పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వస్తుందనే సత్యాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



నూతనంగా బడిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి-కలకడ

పిల్లలందరూ పనిలో కాకుండా బడిలో ఉండాలనే లక్ష్యంతో విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్ నాయక్ తెలిపారు. మండలంలోని నడిమిచర్ల పంచాయతీ నడిమిచర్ల ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 61 మంది విద్యార్థులు ఉండగా వారిలో 11 మంది విద్యార్థులు 5వ తరగతి పూర్తి చేసుకుని రికార్డు సీట్లు తీసుకెళ్లారని ఆయన తెలిపారు. ఈ ఏడాది పాఠశాలలో 50 మంది మాత్రమే విద్యార్థులు మాత్రమే ఉన్నా రని అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పంచాయతీలోని అన్ని గ్రామాలలో పర్యటించి సుమారు 22 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించామని తెలిపారు. 22 మంది విద్యార్థులు చేర డంతో విద్యార్థుల సంఖ్య 72కు చేరుకుందని అన్నారు. ఉపాధ్యాయులు కృషి, తల్లిదండ్రులు చూపించిన చొరవతో మా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగిందని ఆయన తెలిపారు. ఆగస్టు నెల చివరి లోగా మరింత మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయుల సహకారంతో తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. శ్రీను, ఎం.కిరణ్ కుమార్, ఎస్.అయబ్‌బాషా, బి.భాగ్యశ్రీ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యులు ఉయ్యాల రాజారెడ్డి తండ్రి ఉయ్యాల చిన్నమారెడ్డి 3వ వర్ధంతిని సందర్భంగా శనివారం కర్ణాటక రాష్ట్రం, హొసకోటలోని విజన్ ఇండియా ఆశ్రమంలో 60 మంది వృద్ధులు, దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అటు కర్ణాటక, ఇటు ఏపిలో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. అనాథ ఆశ్రమాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఫౌండే షన్ సభ్యులను ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఉయ్యాల రాజారెడ్డి కుటుంబ సభ్యులు సరస్వతి, సుమ, నవీన్‌కుమార్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్, అనిల్ పాల్గొన్నారు.


వృద్ధులకు భోజనాన్ని అందిస్తున్న రాజారెడ్డి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శనివారం విజయవాడ లో తంబళ్లపల్లి నియోజకవర్గం ఎన్నికల ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జున, జిల్లా టిడిపి మాజీ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, టిడిపి మండల నాయకులు బసిరెడ్డి నాగేశ్వర రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కలేషాలు పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం తంబళ్లపల్లి నియో జకవర్గం అభివృద్ధిని, పెద్దమండ్యం మండలంలోని మండల సరిహద్దు రోడ్లు పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి నట్లు పేర్కొన్నారు.

ఈపురుపాలెం దుర్ఘటన అమానుషం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

బాపట్ల జిల్లా చీరాల మండలంలోని ఈపురుపాలెం పంచా యతీలోని సీతారాంపేటలో సుచరిత అనే యువతిని కొందరు అత్యాచారం చేసి, కర్రలతో కొట్టి రైలు పట్టాల వద్ద పడేయడం అమానుషమని పిసిసి మీడి యా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. రాష్ట్రం డ్రగ్స్, మద్యం, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మారిందని పేర్కొన్నారు. ఈ మత్తులో యువకులు అసాంఘిక శక్తులుగా తయారైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్ విద్యార్థులు కూడా వీటికి అలవాటు పడ్డారని తెలిపారు. డ్రగ్స్, మద్యం, గంజాయిని రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోం మంత్రి సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించడం అభినందనీయమన్నారు. ఈపురుపాలెం ఘటనకు కారకులైన వారిని వెన్నువిరిచేలా కఠినంగా శిక్షించాలని తులసిరెడ్డి కోరారు. ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పునరుద్ధరించడంపై పీలేరు మాలమహానాడు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో మాలమహానాడు మండల సహాయ కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణీకుమార్, మండల అధ్యక్షులు గుండ్లూరు రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విదేశీ విద్యా విధానానికి గత ప్రభుత్వం అంబేద్కర్ పేరు తొలగించడం దురదృష్టకరమని అన్నారు. కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం విదేశీ విద్యకు తిరిగి అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధిగా పేరుమార్పు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యమైన ఎస్సి సంక్షేమ పథకాలను, ఎస్సి కార్పొరేషన్ నిధులను, సబ్ ప్లాన్ నిధులను కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పునరుద్ధరించాలని కోరారు. ఎస్సిల పురోగతికి కృషి చేయాలని మాలమహానాడు నాయకులు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రాజ్యాంగ బద్ధమైన దళితుల హక్కులను, రాయితీలను, అవకాశాలను, నిధులను కొనసాగించాలని, ఎస్సీలకు చెందిన 27 సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని, ఎస్సి, ఎస్‌టి సబ్ నిధులు 100 శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని, కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల అభ్యున్నతి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు సమకూర్చాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

రైతులకు భరోసానివ్వని ఆర్‌బికెలు

- వైసిపి పాలనలో ఆశించిన ఫలితాలు శూన్యం
- నూతన ప్రభుత్వంలోనైనా గాడిలో పడేనా?

ప్రజాశక్తి-పుల్లంపేట

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని గత వైసిపి ప్రభుత్వం నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఏమాత్రం భరోసాను ఇవ్వడం లేదు. మండల వ్యాప్తంగా 22 పంచాయతీలకు గాను 11 గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతులు పంట సాగు దగ్గర నుంచి సూచనలు, సలహాలు సహా రైతుకు మద్దతు ధర లభించే వరకు అన్ని విధాలుగా పూర్తి సహకారం కోసం నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు ఆశించిన విధంగా ఫలితాలు ఇవ్వలేదు. మండల వ్యాప్తంగా కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు పలుచోట్ల వృథాగానే దర్శనమిస్తున్నాయి. కేవలం ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా సాగు చేసే వరి విత్తనాలకు ఎరువులకు మాత్రమే ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. గడిచిన మూడేళ్లలో భూసార పరీక్షలు అరకొరగానే నిర్వహించినట్లు నిర్వహిం చినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుకు వెళ్లే ముందు భూసార పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. గడిచిన నాలుగేళ్లుగా భూసార పరీక్షలు సక్రమంగా చేపట్టకపోవడంతో ఇష్టానుసారంగా క్రిమి సంహారక మందులు, ఎరువులు వాడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఆర్‌బికెలో భూసార పరీక్షలు పరికరాలు అందుబాటులో లేవని, రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన డిజిటల్ కియో స్క్ నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ పరికరం ద్వారా ఆన్‌లైన్‌లో విత్తనాలు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసు కోవాల్సి ఉంటుంది. డిజిటల్ కియోస్క్ రైతులకు ఉపయోగపడిన దాఖలాలు అంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు అందుబాటులోకి వచ్చే విధంగా నూతన కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు, రైతుసంఘాల నాయకులు కోరుతున్నారు.



రైతు భరోసా కేంద్రం

ప్రహరీకి నోచని పాఠశాల..ఆందోళనలో విద్యార్థులు


ప్రహరీ లేని నడిమిచర్ల ప్రాథమిక పాఠశాల

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని నడిమిచర్ల పంచాయతీ నడిమిచర్ల ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేయడానికి నాడు-నేడు కార్యక్రమం నిర్వహించారు. నాడు- నేడు పథకం కింద భవనాలను సుందరీకరణంగా నిర్మించారు గానీ, పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయక పోవడంతో పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రతి పాఠశాలకు నాడు-నేడు ద్వారా తరగతి గదులు, వంటగదులు, ప్రహరీ నిర్మించడానికి గత ప్రభుత్వం నిధులను వెచ్చించింది. ఈ పాఠశాలకు గత ఐదేళ్ల క్రితం ప్రహరీ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిం చడంతో ప్రహరీ నిర్మాణానికి దిమ్మెలు ఏర్పాటు చేశారు కానీ పూర్తిస్థాయిలో ప్రహరీ నిర్మించు కోవడం దారుణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణం ముళ్ళ కంపలు, రాళ్లు, గుట్టలు ఉండడంతో అవకాశాలు మెండుగా ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు వాపో తున్నారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులు ఆడుకోవాలన్నా, మలమూత్ర విసర్జనకు వెళ్లాలన్న విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. ఈ పాఠశాలకు ప్రహరీ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసినచో పాఠశాలలో మరింత మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉంటుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకుని సుందరంగా ఉన్న పాఠశాలకు ప్రహరీ విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పువ్వులు కోసే మహిళలూ జాగ్రత్త..!

- ఇంటికి పక్కనే విద్యుత్ తీగలు ఉంటాయి
- కలకడ ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్

ప్రజాశక్తి-కలకడ

ఇంటిపైకి పెంచుకున్న పూల మొక్కలు నుంచి పువ్వులు కోసే మహిళలందరూ విద్యుత్ ప్రమాదాల నుండి జాగ్రత్త పడాలని కలకడ ట్రాన్స్‌కో ఎఇ వరప్రసాద్ అన్నారు. సాధారణంగా మహిళ లందరూ ఎంతో మక్కువతో తమ ఇంటి వద్ద పూల మొక్కలను పెంచుకుంటారని తెలిపారు. ఈ పూల మొక్క లలో మల్లె, సన్నజాజి మొదలగు తీగజాతి మొక్కలను తమ ఇంటి గోడల ద్వారా ఇంటి పైభాగం వరకు అల్లించుకుంటారని అన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా పువ్వులపై ధ్యాస ఉంచి పువ్వులు కోసే సమయంలో తమ ఇంటికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు వున్న విషయాన్ని గమనించాలని తెలిపారు. విద్యుత్ ప్రమా దాలను విస్మరిస్తే పువ్వులు కోస్తూ విద్యుత్ తీగలకు తగిలి ఊహించని క్రమంలో ప్రాణాపాయ పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. విద్యుత్ లైన్లు ఉన్న ఇంటి వారు పూల మొక్కలను విద్యుత్ లైన్ లో ఉన్న వైపు పెంచ కుండా జాగ్రత్తగా పడాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ లైన్ లకు ప్లాస్టిక్ పైపులను అమ ర్చుకోవడం వల్ల కొంతమేరకు ప్రమాదాలను ముందుగానే అరికట్టవచ్చని సూచించారు. ప్లాస్టిక్ పైపులు అమ ర్చుకో వడానికి విద్యుత్ శాఖ వారి దృష్టికి తీసుకువస్తే తమ సిబ్బందిచే తగిన సహకారం అందిస్తామని తెలిపారు.


మల్లెచెట్టుకు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు

పుస్తకాలతో స్నేహం చేస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సబితా ఆధ్వర్యంలో ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి మండల ఉపాధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లతో కాకుండా పుస్తకాలతో ఎక్కువ సమయం గడిపితే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పుస్తకాలు సొంత డబ్బులతో పంపిణీ చేస్తున్నటువంటి సర్తాజ్ హుస్సేన్‌ను ప్రత్యేక అభినందించారు. వచ్చే మార్చిలో జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. హెచ్‌ఎం మాట్లాడుతూ తమ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, గిరిధర్, శామీర్ హుస్సేన్, రమణయ్య పాల్గొన్నారు.


విద్యార్థులకు హిందీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం సబిత

ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలు


నగదు బహుమతులు అందుకుంటున్న ఉత్తమ విద్యార్థులు

ప్రజాశక్తి - నందలూరు

2023-24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పరీక్షలలో మండలంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం బహూకరణ కార్యక్రమం నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. శ్రీరామ్ ప్రజావైద్యశాల అధినేత డాక్టర్ అరిగె రాంప్రసాద్ తన తండ్రి దివంగత అరిగె పెద్దసుబ్బరాయడు జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం మండలంలో ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు పారితోషికం ఇవ్వడం గత సంవత్సరం మొదలెట్టారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు సాయిలోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ యేడాది మండలంలో టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హేమంత్ యాదవ్ 572 మార్కులతో మొదటి స్థానంలో నిలిచినందులకు రూ. 10వేలు, పాటూరు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థి రూప 567 మార్కులు సాధించి రెండవస్థానం సాధించినందుకు రూ. 6వేలు, జడ్‌పి హైస్కూల్ విద్యార్థిని సఫియా సుల్తానా 560 మార్కులు తెచ్చుకొని మూడవస్థానంలో నిలిచినందుకు రూ. 4వేలు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రౌఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

దాడితో మాకు సంబంధం లేదు

- బోనమల ఖాదర్‌వలి

ప్రజాశక్తి - రాయచోటి

ఇరువురూ వైసిపి వారే వారి వ్యక్తిగత తగాదాల వల్ల దాడికి పాల్పడ్డారని, ఆ ఘటనకు తమకు, తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని టిడిపిపట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలి పేర్కొన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో ఇటీవల కాలంలో వైసిపి కౌన్సిలర్, కౌన్సిలర్ భర్తపై జరిగిన దాడికి, తెలుగుదేశం పార్టీ నాయకులకు ఎటువంటిసంబంధం లేదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో వైసిపి గెలుపు కోసం, వైసిపి వారి వెంట తిరిగిన వ్యక్తి సయ్యద్(దాడికి పాల్పడ్డ వ్యక్తి) అన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన దాడులలో వైసిపి మాజీ శాసన సభ్యుడు వెంట నిలిచిన వ్యక్తి సయ్యద్ అన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలు పెట్టి గ్రూపు రాజకీయాలు చేసే సంస్కృతి గల వ్యక్తి వైసిపి మాజీ శాసన సభ్యుల ు శ్రీకాంత్ రెడ్డి అని పేర్కొన్నారు. అంతర్గత కలహాల కారణంగా వైసిపికి చెందిన వారి మధ్య జరిగిన ఘర్షణలను టిడిపి వారిపై నెట్టడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి అన్నారు. గెలిచిప వెంటనే కక్ష సాధింపు రాజకీయాలు చేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఒక నాయకుడు చెబుతున్నారని, జరిగిన ఘటనకు, టిడిపికి ఏమాత్రమూ సంబంధం లేదని స్పష్టం చేశారు. వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, భౌతిక దాడులకు పాల్పడే సంస్కృతి టిడిపి వారికి తెలియదు అన్నారు. ఐదు సంవత్సారాలుగా రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి వారి పదజాలం, పాల్పడిన దాడులు ప్రజలకు తెలియదా అని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలపై తమకు పూర్తి నమ్మకం ఉందని, జరిగిన ఘర్షణకు గల కారణాలను క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించి నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులకు అయన విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఉపయోగపడే శబ్దపు గన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రైతులు, ప్రజలకు ఉపయోగపడే తరహాలో పైపులతో తయారు చేసిన శబ్దపు గన్‌కు విపరీతమైన క్రేజీ వచ్చింది. వీటిని ఓ వ్యక్తి పులివెందుల బిఎస్‌ఎన్‌ఎల్ సమీపాన శనివారం అమ్మకాలు చేశాడు. ఒక్కదాన్ని ధర రూ. 250తో ప్రజలు కొనుక్కున్నారు. ఒకప్పుడు తోటల వద్ద, పందుల బెడద, పక్షుల బెడద, జంతువుల బెడద నుండి రైతులు పంట పొలాలను కాపాడుకునేందుకు డబ్బాలో రాళ్లు వేసి శబ్దం చేసేవారు. కాలక్రమేణా అవి పోయి ఎయిర్‌గన్‌లు వచ్చాయి. వీటితో శబ్దం చేసి పారదోలేవారు. అయితే వాటికి కూడా పక్షులు, జంతువులు భయపడడంలేదు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు పైపులతో శబ్దం వచ్చే గన్ తయారు చేశారు. నిమ్మ, మామిడి, మాగబెట్టే కార్బెట్ ముక్కలను ఆ పైపులో వేసి పైపు కింద ఏర్పాటు చేసిన లాస్ట్ లైటర్ ఒత్తితే భయంకరమైన శబ్దం వస్తుంది. దీంతో రైతులు, ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. పైపుల నుండి వచ్చే శబ్దానికి అడవి జంతువులు, పక్షులు పారిపోతాయని నమ్మకంతో రైతులు కొనుగోలు చేస్తున్నారు. పట్టణ ప్రజలు కోతుల బెడద నుంచి తప్పించుకునేందుకు కూడా పైప్‌ల గన్‌ను కొనుగోలు చేస్తున్నారు.


విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు పంపిణీ చేస్తున్న తహశీల్దార్

పేద విద్యార్థులను ఆదుకోవాలి : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వీరబల్లి తహశీల్దార్ కెవి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వీరబల్లిలోని ఉర్దూ పాఠశాలలో రాస్ ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఐ దాత ఖాజా హుస్సేన్ ఆర్థిక సాయంతో విద్యార్థులకు విద్యా సామగ్రితో పాటు పేట్లు, గ్లాసులు అందించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తెలిపారు. అదేవిధంగా ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకు నేందుకు ముందుకు వచ్చిన ఖాజా హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మరికొందరు దాత లు విద్యార్థులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. ప్రతి ఒక్కరూ నిరుపేదలకు తోడుగా ఉంటూ ఆర్థికంగా ఎదిగేందుకు వారికి సహాయ సహకా రాలు అందించాలన్నారు. గత కొన్నేళ్లుగా సేవలందిస్తున్న రాస్ స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు వలిబాషా సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో పాటు నాయకులు చిన్న రెడ్డప్ప, జయ చంద్రారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరూన్‌బాషా

కిరాయి గుండాలే కౌన్సిలర్లపై దాడి

- 4వ వార్డు కౌన్సిలర్ హరూన్‌బాషా

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బోనమల్ల ఖాదర్‌వలీకు సంబంధించిన కిరాయి గుండాలే మాపై దాడికి ప్రయత్నించారని 4వ వార్డు కౌన్సిలర్ హారున్‌బాషా స్పష్టం చేశారు. శనివారం వైసిపి కార్యాలయంలో కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ వార్డు కౌన్సిలర్ భర్త ఆయన ఇర్ఫాన్‌పై దాడి చేసిన అనంతరం తమ ఇంటి పైకి వచ్చి ఆస్తులు ధ్వంసం చేశారని అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరమన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షుడు అని చెప్పుకుంటున్న బోనమల్ల ఖాదర్‌వలీ సంబందించిన కిరాయి గుండాలు కావడంతో పోలీసు స్టేషన్‌లో రాత్రి నుంచి తెల్లవారు వరకు నిందితులను కాపాడే ప్రయత్నం చేసారని అన్నారు. ఖాదర్‌వలీ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఎన్నికల సమయంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తే వైసిపిలోకి వస్తానని డిమాండ్ చేశాడని అన్నారు. టిడిపిలో ఉంటూ వైసిపి వారితో టచ్‌లో వున్న వ్యక్తి అని అన్నారు. ఇప్పటికైనా మాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు.

పుల్లూరులో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట :మండలం పరిధిలోని ఆంజనేయకొట్టాలు పంచాయతీ కొత్త పుల్లూరులో అంకాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచ్ పెద్దిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులను అందజేశారు.

యువ రచయితలకు చక్కని అవకాశం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విజయవాడలో డిశంబర్ నెలలో జరిగే జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనానికి 40 ఏళ్లలోపు యువతకు చక్కటి అవకాశం కల్పిస్తున్నట్లు కడప జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా రచ యితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వ ర్యంలో డిశంబర్ 28, 29తేదీల్లో జరుగబోవు 'జాతీయ తెలుగు యువ రచ యితల సమావేశాల్లో' రెండు రోజులు శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు అవ కాశం కల్పిస్తున్నారన్నారు. శిక్షణ శిబిరంలో పద్యరచన, వచన కవిత, నవల, గేయం, నాటకం, వ్యాసరచన మొదలగు ప్రక్రియల్లో ప్రసిద్ధ రచయితలతో శిక్షణ ఇప్పించడమే కాకుండా కవి సమ్మేళనాలలో పాల్గొని ప్రశంసాపత్రం జ్ఞాపిక, సత్కారం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సాహిత్య అభిలాషగల యువత వినియోగించుకోవాలని కోరారు. మిగిలిన విషయాలకు జి.వి. పూర్ణచంద్, ప్రధాన కార్యదర్శి 9440172642ను సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్


మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న దండా చెంద్రాయుడు

ఆర్‌టిసి బస్సులో మందుబాబు వీరంగం

ప్రజాశక్తి-నందలూరు

కడప నుంచి రాజంపేట కు వస్తున్న పల్లె వెలుగు బస్సులో ఆకేపాడు హస్తవరం, కొత్తపల్లి గ్రామానికి చెందిన దండా చెంద్రాయుడు అనే వ్యక్తి మద్యం మత్తులో కడపలో బస్సు ఎక్కి టిక్కెట్ తీసుకోకుండా కండెక్టర్, డ్రైవర్, తోటి ప్రయా ణికులతో ఘర్షణకు దిగిన సంఘటన శనివారం చోటు చేసు కుంది. ఇదేమి అన్యాయం అని ప్రశ్నించిన మహిళా ప్రయాణికురాలిపై పాదరక్షతో దాడి చేయడంతో నంద లూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మద్యం మత్తు దిగకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో సైతం వీరంగం సృష్టించాడు. ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదుతో ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ కేసు నమోదు చేశారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తాగిన మైకంలో భార్యను భర్త అతికిరాతకంగా హత్య చేసిన విషాదకర ఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది.పోలీసుల కథనంమేరకు వివరాలు.. మండలంలోని ముదివేడు పంచాయతీ,లక్కసముద్రం పరిధిలోని మేకలవారిపల్లెకు చెందిన లక్ష్మిరెడ్డి రాత్రి మద్యం తాగొచ్చి భార్య రమణమ్మ(45)తో గొడవపడినట్లు తెలిపారు. అర్ధరాత్రి వరకు జరిగడంతో ఆగ్రహించిన భర్త భార్యను అర్ధరాత్రి కొడవలితో అతికిరాతకంగా నరికి హత్య చేసినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న ముదివేడు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తాగిన మైకంలో హత్య చేశాడా, లేదా ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.